

పట్టపగలే చోరీ

భూపాలపల్లి జిల్లా కేంద్రంతోపాటు గణపురం మండలం గొల్లపల్లి గ్రామంలో చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు పగులగొట్టి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. - 18లో▸



విద్యుత్ మోటార్ దొంగల అరెస్ట్

వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను దొంగలించిన కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు మానుకోట పోలీసులు తెలిపారు. - 18లో▸

గరిష్ఠం/కనిష్ఠం

31°/14°

వాతావరణం

జిల్లాలో ఉదయం చలి ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉండి, సాయంత్రం తర్వాత మళ్లీ చలి ప్రారంభం అవుతుంది.

న్యూస్‌రీల్

పనులు వేగంగా చేయాలి



సంగెం: మన ఊరు– మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. బుధవారం మండలంలోని గవిచర్ల, తీగరాజుపల్లి, సంగెం, మొండ్రాయి, పల్లారుగూడ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, పనుల పురోగతిని పరిశీలించారు. పనుల ఆలస్యంపై ప్రశ్నించారు. జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీపీ కళావతి, సర్పంచ్‌లు దొనికెల రమాశ్రీనివాస్, రమాగోపాల్, బాబు, కుమారస్వామి, మల్లేశం, కుమారస్వామి, ఎంపీటీసీ సభ్యులు నర్సింహస్వామి, రాణిమొగిలి, పీఆర్ ఏఈ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

తప్పులు సవరించాలి



విద్యారణ్యపురి: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల సీనియారిటీ జాబితాల్లో తప్పులను సవరించాలని, అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) వరంగల్ జిల్లా శాఖ అధ్యక్షుడు బత్తిని వెంకటరమణ, జనరల్ సెక్రటరీ ఉప్పుల సతీష్ బుధవారం డీఈఓ వాసంతికి వినతిపత్రం సమర్పించారు. చాలా మంది ఉపాధ్యాయుల డీఎస్సీ ర్యాంకు, సీనియారిటీ లిస్టులో తప్పుగా వచ్చాయని డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో కాంబినేషన్ ఆఫ్ సబ్జెక్టు సరిగా పరిశీలించాలని కోరారు. పదోన్నతులు, బదిలీల్లో జిల్లాలో ఉన్న వేకెన్సీ లన్నీ ప్రకటించాలన్నారు. అర్హతలు లేని ఉపాధ్యాయులను కూడా కొన్ని సబ్జెక్టులలో సీనియారిటీ జాబితాలో చేర్చారని వినతిలో పేర్కొన్నారు.

విద్యార్థికి జాతీయ స్థాయి అవార్డు



కాశీబుగ్గ సెంటర్: గత నెల 29నుంచి 31వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ సైన్స్ సిటీలో నిర్వహించిన జాతీయ స్థాయి నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో నగరంలోని శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి టి.శ్రీసాయి పాల్గొని ప్రతిభ కనబరిచింది. 'ఖిలా వరంగల్‌లో కనుమరుగవుతున్న చెరువులు' అనే అంశంపై ప్రాజెక్టు ప్రదర్శించి ఉత్తమ అవార్డు అందుకుందని డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ ఆఫీసర్ కె.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థి శ్రీసాయి, గైడ్ టీచర్ ధనలక్ష్మిలను డీఈఓ అభినందించారు.

'ఏనుమాముల'లో సంబురాలు

వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ గత పాలకవర్గం చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి పదవీకాలం పొడగింపు నేపథ్యంలో బుధవారం మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయం ఎదుట సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచాలు కాల్చి, స్వీట్లు పంచారు.

నేడు షర్మిల పాదయాత్ర

నెక్కొండ/చెన్నారావుపేట: తెలంగాణలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల చేపట్టిన ప్రజాప్రస్థాన పాదయాత్ర ఎక్కడ ఆగిందో అక్కడి నుంచే ప్రారంభమవుతుందని ఆ పార్టీ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాడెం శాంతికుమార్ బుధవారం తెలిపారు. హైకోర్టు అనుమతితోపాటు వరంగల్ సీపీ అనుమతులతో తిరిగి పాదయాత్ర కొనసాగనుందన్నారు. జిల్లాలో నేడు చెన్నారావుపేట మండలం శంకరంతండాలో మధ్యాహ్నం 3.30 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందని వెల్లడించారు. 5.30 గంటలకు నెక్కొండకు చేరుకుంటారని, అక్కడ మాటా ముచ్చట కార్యక్రమం షర్మిల నిర్వహిస్తారన్నారు. అనంతరం నెక్కొండలోనే బస చేస్తారని ఆయన తెలిపారు.

బదిలీలకు 1,048 దరఖాస్తులు

కాశీబుగ్గ సెంటర్ : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్ ద్వారా జిల్లాలో 1,048 మంది ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఆన్‌లైన్ ద్వారా స్వీకరించిన దరఖాస్తులను నేటి నుంచి కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పరిశీలించనున్నారు. ఎంఈఓలకు జాబితాను సమర్పించిన తర్వాత డీఈఓ కార్యాలయంలోని సాంకేతిక బృందం తుది జాబితాను వెల్లడించనుంది. అభ్యంతరాలుంటే సవరించడానికి 8వ తేదీ నుంచి సమయం ఇవ్వనున్నారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం జాబితాను విడుదల చేసి, బదిలీల ఆప్షన్స్‌కు అవకాశం ఇవ్వనున్నారు.



మదినిండా మొక్కులు

సమ్మక్క గద్దె వద్ద కిక్కిరిసిన భక్తులు





జంపన్న వాగులో పూనకాలతో ఊగిపోతున్న భక్తురాలు, ఎత్తు బంగారంతో చిన్నారులు

మండమెలిగె పండుగాయె..

సంప్రదాయ పద్ధతిలో మినీ జాతర ప్రారంభం | మేడారం బాటపట్టిన భక్తజనం

చలి గంజి నేలకారగించిండ్రు. సల్లని తల్లులకు సాకలు వోసిండ్రు. ఉల్లి, మిరప, ఆనిక్కాయలతో దిష్టి తీసిండ్రు. బూరుక కర్రల్ని నిలవెట్టిండ్రు. బూర కొమ్ములతో సప్పుడు జేసిండ్రు. రహస్య పూజల్జేసిండ్రు. రాత్రంతా జాగారం జేసిండ్రు. కీలక ఘట్టాన్ని పూర్తి చేసిండ్రు. జాతరను షురూ జేసిండ్రు. బుధవారం మండమెలిగె కార్యక్రమంతో మేడారం మినీ జాతర ప్రారంభమైంది. ఇప్పటికే భక్తులు మేడారం బాట పట్టారు. - ఎస్ఎస్ తాడ్వాయి

- వివరాలు 18లో▸



ఓరుగల్లుకు వట్టిచేయి..

ఎంతో ఆశగా ఎదురుచూసిన ఉమ్మడి ఓరుగల్లు ప్రజలకు కేంద్ర బడ్జెట్ నిరాశే మిగిల్చింది. కొత్త ప్రాజెక్టులు.. కర్మాగారాలు వస్తాయనుకున్నా.. వట్టి చేతులే చూపించింది. ప్రతీ బడ్జెట్‌కు ఉమ్మడి జిల్లా నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా.. అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత అంతటి ప్రాధాన్యత కలిగిన వరంగల్‌కు అన్యాయం జరుగుతూనే ఉందని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

– సాక్షిప్రతినిధి, వరంగల్

బంగారం మరింత ప్రియం..



ఉమ్మడి వరంగల్‌లో ఏటా సుమారు రూ.500కోట్లకు పైగా బంగారు ఆభరణాల కొనుగోలు జరుగుతుందని అంచనా. ధర పెరుగుతుందనే నేపథ్యంలో బంగారు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపే పరిస్థితి కనిపించడం లేదు. అలాగే రానున్న మూడేళ్లకు 740 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల కోసం నియామకాలు చేపట్టనున్న దరిమిలా ములుగు, మహబూబాబాద్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో టీచర్లు, సహాయక సిబ్బంది కొరత తీరనుంది.

స్మార్ట్ సిటీ, మెగా టెక్స్‌టైల్, 'బయ్యారం' ఊసేలేదు

- గిరిజన యూనివర్సిటీకి రూ.18.50కోట్లే..
- కొత్త, అదనపు రైల్వేలైన్ల మాటేలేదు..
- ఉమ్మడి వరంగల్ రైల్వేకు దక్కని వాటా..

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం ప్రవేశపెట్టిన 2023–24 బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఏడు అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ఎన్నికల బడ్జెట్‌గా పలువురు అభివర్ణిస్తుండగా.. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం నేపథ్యంలో ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చి.. నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు చర్యలు చేపట్టి ఉంటే బాగుండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ధరలు పెద్ద ఎత్తున పెరుగుతున్న నేపథ్యంలో ద్రవ్యోల్బణం నియంత్రణకు ద్రవ్యలోటు తగ్గించేందుకు ప్రాధాన్యత ఇచ్చి ఉంటే బాగుండేదని కొందరు మేధావులు, ఆర్థిక వేత్తలు అంటున్నారు. వేతన జీవుల వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితి పెంపు, టాక్స్ స్లాబులను మార్చడం ఆహ్వానించదగిన అంశాలుగా చెబుతున్నారు. వ్యవసాయం, మార్కెటింగ్, గృహ నిర్మాణం, విద్య, ఐటీ రంగాలపై దృష్టి సారించిన ఫలితంగా ఉమ్మడి వరంగల్‌కు మేలు జరుగుతుందని బీజేపీ నాయకులు చెబుతుండగా.. కేంద్రం కేటాయింపుల్లో ఈసారి కూడా జిల్లాకు అన్యాయం జరిగిందన్న అభిప్రాయాలను వివిధ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

'స్మార్ట్' ఊసేలేదు.. 'ట్రైబల్' రూ.18.50కోట్లే..



గ్రేటర్ వరంగల్ స్మార్ట్ సిటీ పనులకు నిధుల సమస్య తీరడం లేదు. ఈ పథకం కింద రూ.981 కోట్లతో 78 పనులు మంజూరు కాగా.. ఇప్పటికి 27 పనులే పూర్తయ్యాయి. 51 పనులు కొనసాగుతుండగా.. అదనపు నిధుల కోసం ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఇద్దరు ఎంపీలు రెండుసార్లు ప్రతిపాదనలు చేశారు. హైదరాబాద్ తర్వాత పెద్ద నగరమైన వరంగల్‌కు స్మార్ట్ సిటీ పథకం 2016లో మంజూరైనా.. పనులు ముందుకు సాగడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం నిధులు ఇవ్వాల్సి ఉండగా.. రూ.193కోట్లకే పరిమితమైన కేంద్రం ఈసారి నిధులిస్తుందని భావించినా ప్రత్యేకంగా కేటాయించలేదు. ములుగు జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు 360 ఎకరాల స్థల సేకరణ చేశారు. రూ.500కోట్లలో ఈసారి కనీసం రూ.250కోట్లయినా కేటాయిస్తే యూనివర్సిటీ పనులు సాగే అవకాశం ఉండేది. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఈ రెండు గిరిజన యూనివర్సిటీలకు కలిపి రూ.37కోట్లు మాత్రమే కేటాయించారు.

కొత్త పన్ను విధానం.. మహిళలు, వృద్ధులకు శుభవార్త



కొత్త పన్ను విధానంలో గతంలో రూ.5లక్షల వరకు ఆదాయంపై రిబేట్ ఇచ్చేవారు. కానీ.. ఈసారి దాని పరిధిలోకి వచ్చే ఆదాయాన్ని రూ.7లక్షలకు పెంచారు. ఉమ్మడి వరంగల్‌లో సుమారు 1.98 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త పన్ను విధానం వర్తించనుంది. కాగా.. మహిళలు, వృద్ధులకు బడ్జెట్‌లో కేంద్రం తీపి కబురు చెప్పింది. మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ అనే కొత్త పథకాన్ని ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో 59,915 స్వశక్తి మహిళా సంఘాల గ్రూపులు ఉండగా.. ఇందులో 6,51,843 మంది సభ్యులకు అందుబాటులోకి రానుంది. సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్ కింద ప్రస్తుతం గరిష్ఠ పరిమితి రూ.15లక్షల వరకు మాత్రమే ఉండగా.. ఇప్పుడు రూ.30లక్షలకు వరకు పెంచారు.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

- వివరాలు 18లో▸

కొత్త ప్రాజెక్టులు, రైళ్ల మాటే లేదు..



కాజీపేట–హసన్‌పర్తి–హుజూరాబాద్–కరీంనగర్

కాజీపేట పీరియాడికల్ ఓవర్ హాలింగ్ ప్రాజెక్టుకు కేంద్రం రూ.45కోట్లే ఇచ్చింది. 2016–17లో రూ.269.78కోట్ల అంచనా వ్యయంతో ఇది మంజూరైంది. ఐదేళ్ల క్రితం రూ.200కోట్లకు పైగా కేటాయించినా.. భూ సమస్య సాకుతో ఆ నిధుల్ని రైల్వే వెనక్కి తీసుకుంది. ఇప్పుడు సమస్య పరిష్కారమైన నేపథ్యంలో అదనపు నిధులు కలిపి ఎక్కువగా ఇస్తారని భావించినా.. ఆ ప్రస్తావనే రాలేదు. కాజీపేట–హసన్‌పర్తి–హుజూరాబాద్–కరీంనగర్ రైలు మార్గం, కాజీపేట–సికింద్రాబాద్ మూడో లైను తదితర ప్రాజెక్టుల ప్రస్తావన కూడా లేదు. వాణిజ్య, వ్యాపారం, పర్యాటకం, ఐటీపరంగా వృద్ధి చెందుతున్న వరంగల్‌కు ఎంతో అవసరమైన మామునూరు ఎయిర్ పోర్టును పట్టించుకోలేదు. 1,107ఎకరాల భూమి అందుబాటులో ఉండి అన్ని అవకాశాలుండగా.. రైతులకు పరిహారం రూ.130 కోట్లతోపాటు రన్‌వే మరమ్మతులు, విద్యుత్, నీరు, రోడ్లు ఇతర సౌకర్యాలు కల్పించి విమాన ప్రయాణాలను ప్రారంభించేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలన్న ప్రజల కోరికను పక్కన పెట్టారు.

పోలీసు శాఖ ప్రతిష్టను పెంచాలి

- రాష్ట్ర అదనపు డీజీపీ స్వాతి లక్రా
- జక్కలొద్దిలో టీఎస్ఎస్పీ ఫైరింగ్ రేంజ్ ప్రారంభం



స్వాతి లక్రాకు మెమొంటో అందజేస్తున్న కలెక్టర్ గోపి, సీపీ రంగనాథ్, కమిషనర్ ప్రావీణ్య

మామునూరు: పోలీసులు అంకితభావంతో విధులు నిర్వహించి శాఖ ప్రతిష్ఠతను పెంచాలని రాష్ట్ర అదనపు డీజీపీ స్వాతి లక్రా అన్నారు. బుధవారం ఖిలా వరంగల్ మండలం జక్కలొద్ది గ్రామ పరిసరాల్లో ఏర్పాటు చేసిన మామునూరు టీఎస్ ఎస్పీ నాలుగో బెటాలియన్ ఫైరింగ్ రేంజ్‌ని అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ టీఎస్ఎస్పీ స్వాతి లక్రా అతిథులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా ఫైరింగ్ రేంజ్ శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం బెటాలియన్ల అభివృద్ధి, సిబ్బంది సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తోందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ ఇచ్చేందుకు ఫైరింగ్ రేంజ్ ఉపకరిస్తుందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో సర్వాంగ సుందరంగా ఫైరింగ్ రేంజ్ తీర్చిదిద్దడం అభినందనీయమని ఆమె ప్రశంసించారు. జంగిల్ ట్రైనింగ్‌కు సైతం ఉపయోగపడే వాతావర ణం ఇక్కడ ఉందని, ఫైరింగ్ రేంజ్ ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసుశాఖలో ఎంపికైన అభ్యర్థులకు 9 నెలలు శిక్షణ ఇచ్చేందుకు ఫైరింగ్ రేంజ్ ఆధునీకీకరించినట్లు తెలిపారు. ఫైరింగ్ రేంజ్ అభివృద్ధిలో భాగస్వాములైన ప్రతీ ఒక్కరినీ ఆమె అభినందించారు. అనంతరం కలెక్టర్ గోపి, సీపీ రంగనాథ్, బల్దియా కమిషనర్ ప్రావీణ్య, పీటీసీ ప్రిన్స్‌పాల్ ఇంజారపు పూజ, కమాండెంట్స్ శివప్రసాద్‌రెడ్డి, పీజీపీఎస్ చటర్జీ, సిబ్బందికి ఆమె మెమొంటోలు అందించి సన్మానించారు. ఫైరింగ్ రేంజ్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో 4, 5 బెటాలియన్ల కమాండెంట్లు శివప్రసాద్‌రెడ్డి, ఎంఎం స్టోర్స్ మేనేజర్ కె.మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెట్స్ నరేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, జయరాం, రాంబాబు, ఆర్‌ఐలు శోభన్‌కుమార్, రాజిరెడ్డి, పురుషోత్తం రెడ్డి, రమేష్, చంద్రన్న, దయశీల, అశోక్, రాజ్‌కుమార్, ఏవీఎస్‌రెడ్డి, సోమన్న, ఏఓ కల్పన, డాక్టర్ విజయ్ కుమార్, ఏసీపీలు కృపాకర్, కల్కోట్ల గిరికుమార్, ఇన్‌స్పెక్టర్లు ముస్క శ్రీనివాస్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలతో ప్రజలపై భారం



సబ్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో చేస్తున్న నాయకులు

సంగెం: కరెంట్ కోతలు, ఏసీడీ చార్జీలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్‌రావు, టీపీసీసీ కోఆర్డినేటర్ బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పార్వతమ్మ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని కాపులకనిపర్తిలోని సబ్‌స్టేషన్ ఎదుట వరంగల్–మహబూబాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో బుధవారం చేపట్టారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. గత పది రోజులుగా గంటకోసారి కరెంట్ కట్ చేస్తున్నారని, యాసంగిలో వేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో గవిచర్ల ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, మెట్టుపల్లి రమేష్, మడత కేశవులు, నాగరాజు, రాజ్‌కుమార్, సదానందం, చంద్రశేఖర్, యాకూబ్, నవీన్‌రెడ్డి, ఐలయ్య, రాధాకృష్ణ, రవీందర్, సతీష్, మౌలాన్, శ్రీను, రఘు పాల్గొన్నారు.

నేనూ సర్కారు బడి విద్యార్థినే..

- ప్రభుత్వ బడులకు ఇక కార్పొరేట్ స్థాయి
- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

గీసుకొండ: తానుకూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నానని, అప్పట్లోకంటే ప్రస్తుతం బడులు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మన బస్తీ– మన బడి మొదటి విడతలో రూ.22.25 లక్షలతో చేపట్టిన పనులు పూర్తి కాగా ఆయన బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలల్లో ప్రచార ఆర్భాటం తప్ప ఏమీ ఉండదని అన్నారు. సీఎం కేసీఆర్ విజన్‌తో సర్కారు బడులు ఆధునిక హంగులు దిద్దుకుంటున్నాయని తెలిపారు. విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లిష్‌పై ఫోకస్ పెట్టాలని సూచించారు. అదనపు కలెక్టర్ కోట శ్రీవత్స మాట్లాడుతూ.. దేశంలోనే ప్రభుత్వ పాఠశాలలను ప్రత్యేక విజన్‌తో అభివృద్ధి చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానిది అన్నారు. డీఈఓ వాసంతి, జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ సుధీర్ బాబు, మండల స్పెషల్ ఆఫీసర్ మురళీధర్‌రెడ్డి, డీడబ్ల్యూఓ శారద, కార్పొరేటర్లు ఆకులపెల్లి మనోహర్, సుంకరి మనీషా, గద్దె బాబు, డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్, జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, చింతం సదానందం, ఈఈ శంకరయ్య, ఏఈ సుధాకర్, ఎంఈఓ సత్యనారాయణ, హెచ్‌ఎం స్వరూప, ఎంఎన్ఓ రజాక్, ఎస్ఎంసీ చైర్మన్ అశోక్, సుంకరి శివకుమార్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. పాఠశాలలో కొత్త డెస్క్ బెంచీలు ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ధర్మారెడ్డి తరగతి గదిలో కాసేపు కూర్చుని తన పాఠశాల జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అయితే కార్యక్రమం ఆలస్యం అవుతుండటంతో మేయర్ గుండు సుధారాణి పాఠశాల వద్దకు వచ్చి వెనుదిరిగినట్లు తెలిసింది. కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటలైనా ప్రారంభం కాకపోవడంతో ప్రైమరీ పాఠశాల విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడ్డారు.

రాష్ట్రస్థాయి పర్యాటక క్షేత్రంగా శివాలయం


- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పర్వతగిరి: కాకతీయుల కాలంలో నిర్మించిన 800ఏళ్ల చరిత్ర కలిగిన పర్వతగిరి శివాలయాన్ని రాష్ట్రస్థాయి పవిత్ర పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అద్భుత కళా విశిష్టత కలిగిన పర్వతాల శివాలయం పునఃప్రతిష్ఠాపనకు సహకరించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. తెలంగాణ చరిత్ర, కళలు, విశిష్టతలను భావితరాలకు అందజేస్తామన్నారు. వారసత్వ సంపదను పరిరక్షించుకునేందుకు కేసీఆర్ సహకారంతో మరింత కృషి చేస్తామని, శివాలయాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు వేగంగా పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రానున్న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కన్నుల పండుగవగా శివరాత్రి మహోత్సవాన్ని జరపాలని, భక్తులకు అన్ని వసతులు కల్పించాలని ఆలయ ధర్మకర్తలు, అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలియజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కల్లెడ రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు పోడుభూముల పట్టాలు

- కలెక్టర్ గోపి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గోపి

కరీమాబాద్: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పోడు భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గోపి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం పోడు భూములు, అటవీ సంరక్షణ జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గోపి మాట్లాడుతూ.. నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా పోడు భూముల సమస్య ఉన్న నాలుగు మండలాల నుంచి 7,711 మంది పట్టా పాస్ పుస్తకాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. వాటిలో గ్రామ, డివిజన్ స్థాయిలో 1,471 వివిధ కారణాలతో రిజెక్ట్ చేసినట్లు చెప్పారు. మిగతా దరఖాస్తులన్నీ ఉన్నత స్థాయి కమిటీకి పంపించినట్లు పేర్కొన్నారు. పది రోజుల్లో పట్టాదారు పాస్ పుస్తకాలు ప్రింట్ అవుతాయని వెల్లడించారు. నర్సంపేట నియోజకవర్గంలో మొత్తం 3,486 ఎకరాల పోడు భూమికి 58 గ్రామాల నుంచి ఆర్‌ఓఎఫ్‌ఆర్ దరఖాస్తులు అందగా అటవీ హక్కుల చట్టం ప్రకారం 2005 డిసెంబర్ 23వ తేదీ కంటే ముందు కాస్తులో ఉన్న వారినే హక్కుదారులుగా గుర్తించడం జరుగుతుందని, తర్వాత కొత్తగా పోడు భూమి కోసం చెట్లు నరికిన సాగుదారులను అనర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. ఖానాపురం మండలంలోని మొత్తం 9 గ్రామాలకు చెందిన రైతులు ఎన్నో సంవత్సరాల నుంచి కాస్తులో ఉన్నప్పటికీ ఆ భూమి వక్ఫ్ బోర్డుకు చెందినదని వారికి నోటీసులు వచ్చాయని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బత్తిని శ్రీనివాస్‌లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్, ఆర్‌ఓఎఫ్‌ఆర్ జిల్లా కమిటీ సభ్యురాలు పెద్ది స్వప్న, అదనపు కలెక్టర్ శ్రీవత్స, డీఎఫ్ఓ అర్పన, డీటీడీఓ జహీరుద్దీన్, ఆర్డీఓ మహేందర్ జీ, నెక్కొండ జెడ్పీటీసీ లావుడ్య సరోజన, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుడుంబా కేసులో రూ.లక్ష జరిమానా

తిరుమలాయపాలెం: గుడుంబా కేసులో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం తహసీల్దార్ బుధవారం రూ.లక్ష జరిమానా విధించారు. మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం చిలక్కోయలపాడుకు చెందిన మేకల పెద్ద వెంకన్న గతంలో గుడుంబా సారా విక్రయిస్తూ పట్టుబడగా బైండోవర్ కేసు నమోదు చేశారు. కానీ వెంకన్న మళ్లీ గుడుంబా అమ్ముతూ పట్టుబడడంతో రూ.లక్ష జరిమానా విధిస్తూ తహసీల్దార్ పుల్లయ్య ఆదేశాలు జారీ చేశారు. దీంతో బుధవారం ఆయన నుంచి నగదు వసూలు చేసినట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ జయశ్రీ తెలిపారు.

అప్పుల బాధతో యువ రైతు బలవన్మరణం


రవీందర్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : మిర్చి పంట దిగుబడి రాక, అప్పుల బాధతో యువ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మహబూబాబాద్ మండలం రోటిబండ తండాలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. తండాకు చెందిన అజ్మీర రవీందర్(30)కు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గత ఏడాది మిర్చి పంట సాగు చేశాడు. పంట దిగుబడి సరిగా రాకపోగా రూ.రెండు లక్షల అప్పు అయింది. ఈ ఏడాది సైతం మిర్చి సాగు చేయగా మరో రూ.రెండు లక్షల అప్పు అయ్యింది. అదేవిధంగా రూ.8లక్షలు అప్పు చేసి డోజర్ కొనుగోలు చేశాడు. దీంతో అప్పు రూ.12లక్షలకు చేరింది. అప్పు ఎలా తీర్చాలోనని మనోవేదనకు గురైన రవీందర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు, బంధువులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మహబూబాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ మోటార్ దొంగల అరెస్ట్

మహబూబాబాద్ రూరల్: వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను దొంగిలించిన కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహబూబాబాద్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ వై.సతీష్ బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇల్లందు బైపాస్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో యువకులు తాము చేసిన నేరాలను ఒప్పుకున్నారు. వారిని జిల్లా కేంద్రం శివారు గిరిప్రసాద్‌నగర్ కాలనీకి చెందిన ఇమాం, అఖిల్‌గా గుర్తించగా జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్నట్లు తేలింది. మహబూబాబాద్ టౌన్ పీఎస్ పరిధిలో ఒకటి, రూరల్ పీఎస్ పరిధిలో రెండు, కేసముద్రం పీఎస్ పరిధిలో ఒకటి, కురవి పీఎస్ పరిధిలో ఒక మోటార్ దొంగతనం చేశారు. వాటిని స్వాధీనం చేసుకుని టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదే కేసులో ఆటో డ్రైవర్ ఉపేందర్‌పై కూడా కేసు నమోదు చేశారు. టౌన్ ఎస్సై విజయ్‌రాంకుమార్ పాల్గొన్నారు.

జాతర మొదలు

- ఘనంగా మండమెలిగె పండుగ
- మేడారం, కన్నెపల్లిలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు


సమ్మక్క గుడిలో శక్తి పీఠాన్ని అలంకరిస్తున్న మహిళలు


నీరు ఆరబోసేందుకు సిద్ధంగా ఉన్న మహిళలు


హిజ్రాల విన్యాసాలు


యాట మొక్కు చెల్లించేందుకు వస్తున్న భక్తులు


సమ్మక్కకు మొక్కుతున్న యువతులు


గద్దెపై సమ్మక్కను ప్రతిష్ఠిస్తున్న పూజారులు


ఎదురుకోడి మొక్కు సమర్పిస్తున్న భక్తురాలు


సమ్మక్క పూజా సామగ్రిని తీసుకొస్తున్న పూజారులు


జంపన్నవాగు వద్ద భక్తుల స్నానాలు

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క–సారలమ్మ మినీజాతర మండమెలిగె పండుగతో బుధవారం ఘనంగా ప్రారంభమైంది. మేడారంలోని సమ్మక్క ఆలయం, కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంలో పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఉదయాన్నే గుడిని శుద్ధి చేశారు. అనంతరం సమ్మక్క ప్రధాన పూజారి సిద్దబోయిన మునీందర్ ఇంటి నుంచి పసుపు, కుంకుమ, పూజా సామగ్రి.. మరో పూజారి సిద్దబోయిన లక్ష్మణ్‌రావు ఇంటి నుంచి మామిడి తోరణాలను ఆడపడుచులు సమ్మక్క గుడికి తీసుకువచ్చారు. అప్పటికే గుడిలో అమ్మవారి శక్తి పీఠాన్ని ముగ్గులతో అలంకరించారు. పూజారులు మామిడి తోరణాలు తీసుకొని దూప, దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పసుపు, కుంకుమ తీసుకొని గ్రామ శివారులోని పోచమ్మ ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. గ్రామంలోని బొడ్రాయి వద్ద పవిత్ర జాలాలతో శుద్ధి చేసి పూజలు జరిపారు. అనంతరం ఆలయం వద్ద తూర్పు, పడమర దారుల్లో బురుకు కర్రలకు పసుపు, కుంకుమ పెట్టి కొబ్బరి కాయలతో పూజలు చేశారు. మామిడి తోరణాలకు ఉల్లిగడ్డ, మిరప, సొరకాయలు కట్టి స్తంభాలకు కట్టారు. కల్లు, నీళ్ల, పాలు, బెల్లం పానకం, నెయ్యి పానకం, చలి గంజితో మూడుసార్లు నెలపై ఆరగింపు చేశారు. బుధవారం రాత్రి సమ్మక్క గుడి నుంచి పూజారి కొక్కెర కృష్ణయ్య, దూపవడ్ల నాగేశ్వర్‌రావు, సమ్మక్క పూజారులు పసుపు, కుంకుమ, అమ్మవారి పూజా సామగ్రిని తీసుకొని డోలు వాయిద్యాల నడుమ సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్దకు చేరుకున్నారు. పూజారులు వెళ్లే దారిలో ఆడపడుచులు పవిత్ర జలాలతో నీళ్ల ఆరగించారు. అనంతరం సమ్మక్క గద్దె వద్ద రహస్య పూజలు నిర్వహించారు. ఆ సమయంలో అధికారులు విద్యుత్‌ను కాసేపు నిలిపివేశారు. దీంతో మినీ మేడారం జాతర ప్రారంభమైంది. తిరిగి గద్దెల నుంచి గురువారం తెల్లవారుజామున సమ్మక్క పూజారులు గుడికి చేరుకుంటారు. బుధవారం మొదలైన జాతర ఫిబ్రవరి 4 తేదీ వరకు ఘనంగా జరగనుంది. పూజా కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, మహేష్, జనార్దన్, బోజారావు, మల్లెల పూర్ణచందర్, సిద్దబోయిన రమేష్, కొక్కెర రమేష్, మల్లెల ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లిలోనూ..

కన్నెపల్లి సారలమ్మ గుడిలో కాక వంశస్థుల ఆధ్వర్యంలో మండమెలిగె పండుగ ఘనంగా జరిగింది. సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య, ఆడపడుచులు ఆలయాన్ని, ఆలయంలో భద్రపర్చిన సారలమ్మ పూజా సామగ్రిని శుద్ధి చేశారు. సారలమ్మ వడెరాలను పసుపు, కుంకుమతో అలంకరించారు. పూజారి కాక సారయ్య ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పసుపు, కుంకుమ, శాక(సారా)లను తీసుకొని మేడారంలోని అమ్మవార్ల గద్దెలకు చేరుకున్నారు. గద్దెల వద్ద సమ్మక్క, సారలమ్మల పూజారులు కలుసుకొని కంకణాలు కట్టుకుని శాక(సారా)ను ఇచ్చిపుచ్చుకున్నారు. రాత్రంతా గద్దెల ప్రాంగణంలో జాగారం చేశారు. తిరిగి గురువారం ఉదయాన్నే పూజారులు సారలమ్మ గుడికి చేరుకుంటారు.

ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల చర్యలు

పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సదానందం, డీఎస్పీ, ఐదుగురు సీఐలు, 16 మంది ఎస్సైలు విధులు నిర్వర్తిస్తూ ట్రాఫిక్ మళ్లింపు, ఇతర చర్యలు తీసుకుంటున్నారు. భక్తులు ఇబ్బంది పడకుండా ఎటు వాహనాలు ఆ వైపు నుంచే నేరుగా గద్దెల సమీపంలోకి చేరుకునేలా చర్యలు తీసుకున్నారు. జాతరలో మొత్తం 360 మంది పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు.

డిజిటల్ హుండీల ఏర్పాటు


డిజిటల్ (క్యూఆర్ కోడ్) హుండీని ప్రారంభిస్తున్న అధికారులు

సమ్మక్క–సారలమ్మల గద్దెల ప్రాంగణంలో భక్తులు ఆన్‌లైన్ ద్వారా కానుకలు సమర్పించేందుకు తాడ్వాయి కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో నాలుగు డిజిటల్(క్యూఆర్ కోడ్ కలిగి ఉన్న) హుండీలను ఏర్పాటు చేశారు. సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెల సమీపంలో ఈ డిజిటల్ హుండీలు ఉన్నాయి. బ్యాంకు మేనేజర్ రవికిరణ్, సమ్మక్క పూజారి సిద్దబోయిన అరుణ్, ఎండోమెంట్ సూపరింటెండెంట్ క్రాంతికుమార్, బ్యాంకు అటెండర్ రాములు పాల్గొన్నారు.

మాజీ మావోయిస్టు శంకర్ మృతి


శంకర్ (ఫైల్)

చిల్పూరు: మాజీ మావోయిస్టు సాంబరి శంకర్(59) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జనగామ జిల్లా చిల్పూరు మండల కేంద్రానికి చెందిన శంకర్ 1990కి ముందు జీపు డ్రైవర్‌గా పని చేసేవాడు. అదే సమయంలో మావోయిస్టులతో పరిచయాలు పెరిగి కదారి రాములు నేతృత్వంలో పార్టీలో చేరాడు. అనతి కాలంలోనే దళం ఏరియా కమిటీ సభ్యుడిగా ఎదిగాడు. 1994లో మీదికొండ, తాటికొండ, అశ్వరావుపల్లి గ్రామాల సరిహద్దుల్లో జరిగిన ఎదురు కాల్పుల్లో తీవ్రంగా గాయపడి ప్రభుత్వానికి సరెండర్ అయ్యాడు. అప్పటి నుంచి జీపు నడుపుతూ జీవనం సాగించేవాడు. పనినిమిత్తం జీపులో హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మంత్రి కడియం శ్రీహరి సహకారంతో మెరుగైన వైద్యం చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఇంటి పట్టునే ఉంటున్న అతడు అనారోగ్యానికి గురై మృతి చెందాడు. మృతుడికి భార్య ఉంది.

గొల్లపల్లిలో పట్టపగలే చోరీ

- 5 తులాల బంగారం, రూ.93వేల నగదు అపహరణ

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గొల్లపల్లి గ్రామంలో బుధవారం పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన బండారి చేరాలు తన భార్యతో కలిసి ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువా తాళాలను సైతం పగులగొట్టి రూ.3 లక్షల విలువైన చేసే 5 తులాల బంగారు ఆభరణాలు, రూ.93 వేల నగదును అపహరించుకుపోయారు. సాయంత్రం ఇంటికి వచ్చిన చేరాలు చోరీ జరిగినట్లు గుర్తించి పోలిసులకు సమాచారం అందించారు. ఎస్సై అభినవ్ ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భూపాలపల్లిలో ..

భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రెండు చోరీలు జరిగినట్లు సీఐ రాజిరెడ్డి తెలిపారు. పట్టణంలోని కారల్‌మార్క్స్‌కాలనీకి చెందిన సుందరి శ్రీనివాస్ గత నెల 29న ఇంటికి తాళం వేసి వరంగల్‌కు వెళ్లాడు. తిరిగి మంగళవారం రాత్రి ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చుడగా బీరువాలోని నాలుగు తులాల బంగారం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు కేసు నమోదైంది. అలాగే అయ్యప్ప దేవాలయంలో హుండీని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని కానుకలను ఎత్తుకెళ్లారు.

భయంతో రైలు దిగి పారిపోతూ..

- బావుల్లో పడిన ఇద్దరు మహిళలు...
- ఈత రాక ఒకరి మృతి


వాలి (ఫైల్)

నెక్కొండ: భయంతో రైలు దిగి పారిపోతూ ఇద్దరు మహిళలు వేర్వేరు బావుల్లో పడ్డారు. ఈ ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బంజరుపల్లి గ్రామంలో బుధవారం ఈ ఘటన జరిగింది. ఎస్సై సీమాఫర్హీన్ తెలిపిన వివరాల ప్రకారం.. పర్వతగిరి మండలం దౌలత్‌నగర్ శివారు ఇస్లావత్‌తండాకు చెందిన అజ్మీర వాలి(40), నెక్కొండ మండలం బంజరుపల్లి శివారు లావుడ్యా వాగ్యానాయక్ తండాకు చెందిన కాలీ, భూక్యా పద్మ, ధరంసోత్ సాయికుమార్, దీక్షకుంట గ్రామానికి చెందిన అనుముల రాకేష్ జనవరి 30వ తేదీ రాత్రి బెల్లం మూటలతో బలార్షాలో న్యూఢిల్లీ నుంచి పాండిచేరికి వెళ్తున్న పాండిచేరి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. ఎలుగూరు రైల్వేస్టేషన్ దాటిన తర్వాత రాత్రి 11 గంటల సమయంలో రైలు చైన్ లాగారు. దీంతో లావుడ్యా వాగ్యానాయక్ తండాలో రైలు నిలిచిపోయింది. రైల్వే పోలీసులు అప్రమత్తమై వీరిని ప్రశ్నిస్తున్న క్రమంలో బెల్లం మూటలను వదిలి పారిపోయేందుకు యత్నించారు. ఈ క్రమంలో వాలి. పద్మ వేర్వేరు వ్యవసాయ బావుల్లో పడిపోయారు. పద్మకు ఈత రావడంతో ప్రాణాలతో బయటపడింది. మరుసటి రోసు వాలీ కోసం కుటంబ సభ్యులు గాలించగా బావిలో శవమై కనిపించింది. మృతురాలి భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

రామన్నపేట: వరంగల్ బస్టాండ్ సమీపంలో ఆటో కోసం ఎదురుచూస్తున్న వ్యక్తిపై దాడి చేసి డబ్బులు లాక్కొని వెళ్లిన ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జనవరి 28వ తేదీ తెల్లవారుజామున వరంగల్ బస్టాండ్ సమీపంలో ఆటో కోసం ఎదురుచూస్తున్న సాయితేజ వద్దకు ముగ్గురు వ్యక్తులు వచ్చి అతడిపై దాడి చేసి రూ.9 వేలు లాక్కున్నారు. దీంతో సాయితేజ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాలు, సాంకేతికతను ఉపయోగించి వీరన్నకుంటకు చెందిన షేక్ సోయల్, శివనగర్‌కు చెందిన జంబాల కార్తీక్, షేక్ ఖాజాను నిందితులుగా గుర్తించి బుధవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2 వేల నగదు, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు.

రసవత్తరంగా ఎస్‌పీఎల్


గెలుపొందిన మాస్టర్ జీ డిగ్రీ కళాశాల జట్టు


గెలుపొందిన నిట్ జట్టు


విజయం సాధించిన ఆర్ట్స్ అండ్ సైన్స్ జట్టు

- సెమీస్‌కు చేరిన జట్లు

రామన్నపేట : వరంగల్ ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ కళాశాల మైదానంలో ఐదు రోజులుగా జరుగుతున్న సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. బుధవారం 8 జట్లు క్వార్టర్స్ ఫైనల్స్‌లో తలపడ్డాయి. మొదటి మ్యాచ్‌లో మాస్టర్ జీ డిగ్రీ కళాశాల, ఎల్బీ కళాశాల జట్లు పోటీ పడ్డాయి. టాస్ గెలిచి మాస్టర్ జీ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో మొదటి బ్యాటింగ్ చేసిన ఎల్బీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన మాస్టర్ జీ కళాశాల జట్టు 9.1 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 68 పరుగులు చేసి విజయ కేతనం ఎగరవేసింది.


గెలుపొందిన వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ జట్టు

- రెండో మ్యాచ్‌లో నిట్ వర్సెస్ చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన నిట్ 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 96 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 61 పరుగులు మాత్రమే సాధించి 35 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.
- మూడో మ్యాచ్‌లో వాగ్దేవి, జయముఖి కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వాగ్దేవి జట్టు 10 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 126 పరుగులు సాధించింది. ఛేదనలో జయముఖి జట్టు 10 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 81 పరుగుల మాత్రమే చేసి ఓటమి పాలైంది.
- నాల్గో మ్యాచ్‌లో తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన తాళ్ల పద్మావతి జట్టు 10 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 58 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు 6.3 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 62 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్‌లో విజయం సాధించిన మాస్టర్ జీ, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ, వాగ్దేవి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్లు సెమీ ఫైనల్ చేరాయి.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు


మిశ్రమ బడ్జెట్



విద్యారణ్యపురి: ఇది మిశ్రమ బడ్జెట్. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెట్టినట్లు ఉంది. ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చి నిరుద్యోగం తగ్గించే చర్యలు, ద్రవ్యలోటు తగ్గించే చర్యలు చేపడితే బాగుండు. వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితి పెంపు, టాక్స్ స్లాబులను మార్చడం ఆహ్వానించదగిన అంశాలే. లోకసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గిరిజనులు, రైతులు, వేతన జీవులు, మహిళలపై వరాల జల్లు కురిపించినట్లు కనిపిస్తుంది. బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి నిరాశే ఎదురైంది.

– డాక్టర్ తిరుణహరిశేషు, కేయూ ఎకనామిక్స్ అధ్యాపకుడు

వేతన జీవులకు ఊరట



ఆదాయ పరిమితి పెంచడం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఊరటనిచ్చింది. కానీ ఈ నిర్ణయం తీసుకోవడం ఆలస్యమైంది. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేసినప్పుడే ఉద్యోగులు, ఉపాధ్యాయులు సంతోషంగా ఉంటారు. ఈ విషయమై తక్షణమే పార్లమెంట్‌లో చట్టం చేయాలి.

– మన్నె చంద్రయ్య, టీపీఆర్‌టీయూ రాష్ట్ర ప్రచార కార్యదర్శి


ప్రజల కలలు సాకారం



హన్మకొండ: కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజల కలలను సాకారం చేసింది. సమాజంలోని చిట్ట చివరి వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందించే విధంగా ఉంది. వేతన జీవులు, మధ్యతరగతి వర్గాల ఆదాయ పన్ను పరిమితిని రూ.7 లక్షలకు పెంచి, పన్ను విధానంలో వెసులుబాట కల్పించడం హర్షణీయం. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కేటాయింపు మరో సంవత్సరం పాటు పెంచడం, రైల్వేకు రూ.2 లక్షల కోట్లు కేటాయించడం సంతోషకరం.

– రావు పద్మ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు

ఉద్యోగులకు ఊరట అవాస్తవం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట అని వస్తున్న ప్రచారంలో నిజం లేదు. బడ్జెట్‌లో తెలిపినట్లు రూ.7 లక్షలలోపు ఎలాంటి టాక్స్ లేదనేదానిలో వాస్తవం లేదు. పాత టాక్స్ విధానంలో ఉన్న లోన్లు, హెచ్‌ఆర్‌ఏ, 80 డీ, టీపీఎస్ వంటి మినహాయింపులు లేవు. వీటికి మినహాయింపు ఇస్తూ రూ.7లక్షల లోపు టాక్స్ లేదని స్పష్టంగా ప్రకటించి ఉంటే ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట లభించేది.

– చందా భద్రయ్య, హెచ్‌ఎం, మల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల


రిబేట్ పరిమితి పెంచడం సంతోషం



హనుమకొండ చౌరస్తా: కేంద్ర బడ్జెట్ మధ్య తరగతి, వేతన జీవులకు భారీ ఊరటను కలిగించింది. వ్యక్తిగత పన్ను రిబేట్ పరిమితిని రూ.7లక్షలకు పెంచడం సంతోషకరం. కొత్త పన్ను విధానం డిఫాల్ట్‌గా అమలుకానుందని, ఈ విధానాన్ని ఎంచుకునే అవకాశం పన్ను చెల్లింపుదారులకు వదిలేస్తున్నట్లు కేంద్ర ప్రకటించడం శుభ పరిణామమే. లీవ్ ఎన్ క్యాష్‌మెంట్‌పై పన్ను మినహాయింపును రూ.3లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించడం ఊరటను కల్గించడమే.

– తిప్పర్తి రాఘవరెడ్డి, చార్టెడ్ అకౌంటెంట్, హనుమకొండ

విద్య, వైద్యంపై నిర్లక్ష్యం



విద్యారణ్యపురి: బడ్జెట్‌లో విద్య, వైద్యాన్ని నిర్లక్ష్యం చేశారు. గత బడ్జెట్‌లో విద్యకు 2.64శాతం నిధులు కేటాయించగా ఈసారి 2.51 శాతం మాత్రమే కేటాయించారు. వైద్యానికి గత బడ్జెట్‌లో 2.20శాతం నిధులు కేటాయించగా ఈసారి 1.98 శాతానికి పరిమితం చేసింది. ఆదాయ పరిమితి పెంపు వేతన జీవులకు ఊరటనిచ్చింది. మధ్య తరగతి, వేతన జీవులపై మాత్రం పన్నుపోటు తప్పదు.

– కదారి భోగేశ్వర్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

అంకెల గారడీ



న్యూశాయంపేట: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చెయ్యి మిగిలింది. అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. విభజన హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, ములుగులో గిరిజన యూనివర్సిటీలను కేంద్రం విస్మరించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని అన్యాయం జరిగింది. డిజిటలైజేషన్ పేరుతో కార్పొరేట్ వర్గాలకే పెద్దపీట వేశారు.

– టి.శ్రీనివాస్‌రావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు

అప్పుల కుప్పగా దేశం



హన్మకొండ : నరేంద్రమోదీ పాలనలో దేశం అప్పుల కుప్పగా మారింది. బడ్జెట్‌లో ఈ విషయం మరోసారి స్పష్టమైంది. దేశ బడ్జెట్‌లో 34 శాతం అప్పులే ఉన్నాయని, 20 శాతం అప్పుల వడ్డీ కిందే పోతుందంటే ఇంతకన్నా దౌర్భాగ్యం ఇంకేముంది. అప్పులతో దేశం అభివృద్ధి చెందిందా అంటే అది లేదు. పేదలు మరింత పేదలుగా మారారు. హంగర్ ఇండెక్స్‌లో దేశ స్థానం నానాటికి దిగజారిపోతుంది. కార్పొరేట్లకు దోచిపెట్టడం మినహా మోదీ సర్కార్ చేసిందేమీ లేదు.

– వై.సతీష్‌రెడ్డి, రెడ్‌కో చైర్మన్

అండర్-19 ప్రపంచకప్ విజేత జట్టుకు బీసీసీఐ సన్మానం

ఐసీసీ తొలిసారి నిర్వహించిన అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌ను సాధించిన టీమిండియా సభ్యులను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం అహ్మదాబాద్‌లో ఘనంగా సన్మానించింది. న్యూజిలాండ్‌తో ఆఖరి టి20 పోరుకు ముందు జరిగిన ఈ వేడుకలో బోర్డు ప్రకటించిన రూ. 5 కోట్ల నజరానాను భారత దిగ్గజం సచిన్ చేతుల మీదుగా అండర్-19 జట్టు కెప్టెన్ షఫాలీ వర్మ అందుకుంది. అమ్మాయిలు అద్భుతంగా రాణించారని కితాబిచ్చిన 'మాస్టర్'... ఈ ఘనతతో మరెంతో మంది మహిళా క్రికెటర్ల కలలకు ఊపిరి పోశారని అన్నారు.





గిల్

గిల్ జిగేల్...

- భారత ఓపెనర్ మెరుపు సెంచరీ
- ఆఖరి టి20 పోరులో టీమిండియా 168 పరుగులతో విజయం
- కివీస్‌పై 2-1తో సిరీస్ సొంతం

అహ్మదాబాద్: మోదీ స్టేడియంలో భారత్ పరుగుల మోత మోగించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్ (63 బంతుల్లో 126 నాటౌట్; 12 ఫోర్లు, 7 సిక్సర్లు) తన బ్యాటింగ్ సునామీని చూపించాడు. దీంతో ఆఖరి టి20లో టీమిండియా 168 పరుగుల భారీ తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి 2-1తో సిరీస్ గెలుచుకుంది. మొదట భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. రాహుల్ త్రిపాఠి (22 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరిపించాడు. అనంతరం న్యూజిలాండ్ 12.1 ఓవర్లలో 66 పరుగులకే కుప్పకూలింది. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' హార్దిక్ పాండ్యా నాలుగు వికెట్లు తీశాడు.

గిల్ విధ్వంసం

ఇషాన్ కిషన్ (1) రెండో ఓవర్లోనే నిష్క్రమించగా... గిల్, త్రిపాఠి కివీస్ బౌలర్లపై ఆకాశమే హద్దుగా చెలరేగారు. రెండో వికెట్‌కు ఈ జోడీ మెరుపులతో 7 ఓవర్ల వ్యవధిలోనే భారత్ 80 పరుగులు చేసింది. తర్వాత సూర్యకుమార్ (13 బంతుల్లో 24; 1 ఫోర్, 2 సిక్సర్లు) వేగంగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా క్రీజులోకి రాగా... 15 ఓవర్లలో భారత్ స్కోరు 156/3. శుబ్‌మన్ 44 బంతుల్లో 67 పరుగులతో ఉన్నాడు. గిల్ అప్పటిదాకా ఒక ఆట, 16వ ఓవర్ నుంచి మరో ఆట ఆడాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడిన గిల్... లిస్టర్, టిక్నర్, ఫెర్గూసన్ ఎలా ఎవరెదురైనా... బంతుల్ని అదేపనిగా బౌండరీ దాటించాడు. పాండ్యా ఆడిన బంతుల్ని మినహాయిస్తే... గిల్ 16 బంతులను వరుసగా 0, 6, 6, 1, 6, 4, 0, 6, 1, 4, 6, 1, 4, 1, 4, 6లుగా ధనాదంచేశాడు. దీంతో 4 ఓవర్లలోనే భారత్ 72 పరుగులు చేసింది. ఇందులో 56 పరుగులు గిల్‌వే! ఈ క్రమంలో 54 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఆఖరి ఓవర్లో పాండ్యా (17 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్) అవుట్‌కాగా కేవలం 6 పరుగులే వచ్చాయి. భారత్ పేస్‌కు కివీస్ బ్యాటర్స్ వణికారు. మూడో ఓవర్లోనే కివీస్ 7 పరుగులకే 4 వికెట్లను కోల్పోవడంతో భారత విజయానికి బాటపడింది. మిచెల్, సాన్‌ట్నర్ మాత్రమే రెండంకెల స్కోరు చేశారు.



సిరీస్ ట్రోఫీతో కెప్టెన్ హార్దిక్

126 అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత క్రికెటర్‌గా శుబ్‌మన్ గిల్ (126 నాటౌట్) గుర్తింపు పొందాడు. కోహ్లి (122 నాటౌట్; అఫ్గానిస్తాన్‌పై 2022 లో) పేరిట ఉన్న రికార్డును గిల్ సవరించాడు.

168 అంతర్జాతీయ టి20ల్లో పరుగుల తేడా పరంగా భారత్‌కిదే అతిపెద్ద విజయం. 2018లో ఐర్లాండ్‌పై 143 పరుగుల తేడాతో సాధించిన విజయం రెండో స్థానానికి వెళ్లింది.

5 భారత్ తరఫున మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20లు) సెంచరీ సాధించిన ఐదో క్రికెటర్‌గా గిల్ నిలిచాడు. గతంలో రైనా, కేఎల్ రాహుల్, రోహిత్, కోహ్లి ఈ ఘనత సాధించారు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బ్రేస్‌వెల్ 1; గిల్ (నాటౌట్) 126; త్రిపాఠి (సి) ఫెర్గూసన్ (బి) సోధి 44; సూర్యకుమార్ (సి) బ్రేస్‌వెల్ (బి) టిక్నర్ 24; పాండ్యా (సి) బ్రేస్‌వెల్ (బి) మిచెల్ 30; హుడా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 234.**
వికెట్ల పతనం: 1-7, 2-87, 3-125, 4-228.
బౌలింగ్: లిస్టర్ 4-0-42-0, బ్రేస్‌వెల్ 1-0-8-1, ఫెర్గూసన్ 4-0-54-0, టిక్నర్ 3-0-50-1, ఇష్ సోధి 3-0-34-1, సాన్‌ట్నర్ 4-0-37-0, మిచెల్ 1-0-6-1.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (సి) సూర్య (బి) పాండ్యా 3; కాన్వే (సి) పాండ్యా (బి) అర్ష్‌దీప్ 1; చాప్‌మన్ (సి) ఇషాన్ (బి) అర్ష్‌దీప్ 0; ఫిలిప్స్ (సి) సూర్య (బి) పాండ్యా 2; మిచెల్ (సి) మావి (బి) ఉమ్రాన్ 35; బ్రేస్‌వెల్ (బి) ఉమ్రాన్ 8; సాన్‌ట్నర్ (సి) సూర్య (బి) మావి 13; ఇష్ సోధి (సి) త్రిపాఠి (బి) మావి 0; ఫెర్గూసన్ (సి) ఉమ్రాన్ (బి) పాండ్యా 0; టిక్నర్ (సి) ఇషాన్ (బి) పాండ్యా 1; లిస్టర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (12.1 ఓవర్లలో ఆలౌట్) 66.** **వికెట్ల పతనం:** 1-4, 2-4, 3-5, 4-7, 5-21, 6-53, 7-53, 8-54, 9-66, 10-66. **బౌలింగ్:** హార్దిక్ పాండ్యా 4-0-16-4, అర్ష్‌దీప్ సింగ్ 3-0-16-2, ఉమ్రాన్ మాలిక్ 2.1-0-9-2, కుల్దీప్ యాదవ్ 1-0-12-0, శివమ్ 2-0-12-2.

ఆంధ్ర 379 ఆలౌట్

ఎడమచేతి వాటంతో బ్యాటింగ్ చేసిన విహారి



విహారి

ఇండోర్: డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 127.1 ఓవర్లలో 379 పరుగులకు ఆలౌటైంది. రెండో రోజు ఆటలో ఆంధ్ర కెప్టెన్ హనుమ విహారి (27; 3 ఫోర్లు) చేతి గాయంతో బాధపడుతున్నా జట్టు అవసరాలరీత్యా ఎడమచేతి వాటం బ్యాటింగ్ చేయడం హైలైట్‌గా నిలిచింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. ప్రస్తుతం మధ్యప్రదేశ్ మరో 235 పరుగులు వెనుకంజలో ఉంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ రెండు వికెట్లు తీయగా... నితీశ్ కుమార్ రెడ్డి, పృథ్వీరాజ్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 262/2తో ఆట కొనసాగించిన ఆంధ్ర ఒకదశలో 323/2తో పటిష్టంగా కనిపించింది. అయితే సెంచరీ పూర్తి చేసుకున్న కరణ్ షిండే (110; 12 ఫోర్లు, 2 సిక్సలు)... రికీ భుయ్ (149; 18 ఫోర్లు, 1 సిక్స్) ఐదు పరుగుల తేడాలో అవుటయ్యాక ఒక్కసారిగా ఆంధ్ర ఇన్నింగ్స్ కుప్పకూలింది. 30 పరుగుల తేడాతో ఆంధ్ర జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 353/9గా నిలిచింది. ఈ దశలో తొలి రోజు ఆటలో గాయపడి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన కెప్టెన్ హనుమ విహారి క్రీజులోకి వచ్చాడు. చేతి గాయాన్ని లెక్కచేయకుండా తన సహజశైలి కుడిచేతి వాటం బదులుగా ఎడమచేతి వాటంతో విహారి బ్యాటింగ్ చేసి ఔరా అనిపించాడు. చివరి వరుస బ్యాటర్ లలిత్ మోహన్ (22 నాటౌట్; 3 ఫోర్లు)తో కలిసి హనుమ విహారి 26 పరుగులు జోడించి సారాంశ్ జైన్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరగడంతో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ ముగిసింది.

జాతీయ స్కూల్స్ చెస్‌లో తెలంగాణకు ఏడు పతకాలు



యశ్వి జైన్

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాల పంట పండించారు. తమిళనాడులో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణకు ఏడు పతకాలు లభించాయి. ఇందులో ఐదు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం ఉన్నాయి. అండర్-15 బాలుర విభాగంలో వేముల అద్వైత్ విఘ్నేశ్ (7.5 పాయింట్లు)... అండర్-15 బాలికల విభాగంలో యశ్వి జైన్ (7 పాయింట్లు)... అండర్-13 బాలుర విభాగంలో చల్లా సహర్ష (8 పాయింట్లు)... అండర్-11 బాలికల విభాగంలో మోదిపల్లి దీక్షిత (7.5 పాయింట్లు)... అండర్-9 బాలికల విభాగంలో పుంగవనం సంహిత (8 పాయింట్లు) పసిడి పతకాలు గెలిచారు. అండర్-7 బాలుర విభాగంలో ఆదుళ్ల దివిత్ రెడ్డి (7.5 పాయింట్లు) కాంస్యం, అండర్-7 బాలికల విభాగంలో బోగా వంశిక (7 పాయింట్లు) రజతం సాధించారు. పతకాలు సాధించిన వారికి నెలనెలా భారత గ్రాండ్‌మాస్టర్ ఎం.శ్యామ్‌సుందర్‌తో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ ప్రకటించారు.

ప్రీక్వార్టర్స్‌లో సాయిప్రణీత్



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ సాయిప్రణీత్ ప్రీక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సాయిప్రణీత్ 21-13, 21-14తో మాడ్స్ క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్)పై గెలుపొందాడు. మరో మ్యాచ్‌లో కిరణ్ జార్జి (భారత్) 21-17, 19-21, 23-21తో చెయుక్ యి లీ (హాంకాంగ్)ను ఓడించాడు. అయితే భారత్‌కే చెందిన సమీర్ వర్మ, ప్రియాన్షు రజావత్, మిథున్ మంజునాథ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. ప్రియాన్షు 21-14, 19-21, 25-27తో హియో క్వాంగ్ హీ (దక్షిణ కొరియా) చేతిలో... సమీర్ వర్మ 14-21, 16-21తో లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో.. మిథున్ 18-21, 12-21తో నిషిమోటో (జపాన్) చేతిలో ఓడిపోయారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ జోడీ 21-11, 21-16తో టై అలెగ్జాండర్-జోసెఫిన్ వు (కెనడా) ద్వయంపై గెలుపొంది ప్రీక్వార్టర్ ఫైనల్ చేరింది.

సినిమా



● రజనీకాంత్

జైసల్మేర్‌లో జైలర్

రాజస్థాన్‌లోని జైసల్మేర్‌కు వెళ్లారు 'జైలర్'. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జైలర్'. రమ్యకృష్ణ, తమన్నా, శివరాజ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలో మోహన్‌లాల్ ఓ అతిథి పాత్ర చేస్తున్నారు. ఇటీవలే చెన్నైలో ఒక భారీ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న 'జైలర్' చిత్ర యూనిట్ ఇప్పుడు 'జైసల్మేర్'కు చేరుకుంది. ఈ షూటింగ్‌లో పాల్గొనడానికి ఆల్రెడీ రాజస్థాన్‌లో ల్యాండ్ అయ్యారు రజనీకాంత్. ఈ షెడ్యూల్ దాదాపు రెండు వారాలు జరగనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రజనీకాంత్ – మోహన్‌లాల్‌పై కీలక సన్నివేశాలను ప్లాన్ చేశారని సమాచారం. ఇక ఈ చిత్రం ఈ ఏడాది ఆగస్టులో విడుదలయ్యే అవకాశం ఉంది.

హెలికాప్టర్‌లో షూటింగ్‌కి...

హెలికాప్టర్‌లో షూటింగ్ లొకేషన్‌కు వెళుతున్నారు కమల్‌హాసన్. 1996లో హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్' సినిమాకు సీక్వెల్‌గా వీరిద్దరి కాంబినేషన్‌లోనే 'ఇండియన్ 2' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం కడపలోని గండికోట విలేజ్‌లో జరుగుతోంది. తిరుపతి నుంచి గండికోట లొకేషన్‌కు రోజూ హెలికాప్టర్‌లో వెళ్తున్నారు కమల్‌హాసన్. కాగా కమల్ హెలికాప్టర్ రైడ్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రం షూటింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి, కాల్షీట్స్, షూటింగ్ సమయం వృథా కాకుండా చూసేందుకు కమల్ ఇలా హెలికాప్టర్ రైడ్ చేస్తున్నారన్నది కోలీవుడ్ టాక్. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, రకుల్‌ప్రీత్‌సింగ్, బాబీ సింహా కీ రోల్స్ చేస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది.



● కమల్‌హాసన్

పల్లెటూరి ప్రేమ

పార్వతీశం, జశ్విక జంటగా వైభవ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తెలుసా.. మనసా..'. వర్షా ముందాడ, మాధవి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను 'దిల్' రాజు విడుదల చేశారు. వైభవ్ మాట్లాడుతూ– ''ఓ గ్రామంలో బెలూన్స్ అమ్ముకునే మల్లిబాబు (పార్వతీశం), అదే ఊర్లో పనిచేసే హెల్త్ అసిస్టెంట్ సుజాత (జశ్విక)ను ప్రేమిస్తాడు. అయితే సుజాతకు మల్లిబాబు దూరం కావాల్సి వస్తుంది. ఆ తర్వాత వారిద్దరూ కలుసుకున్నారా? లేదా అనేది చిత్ర కథ'' అన్నారు. ''న్యూ ఏజ్ లవ్ స్టోరీ చిత్రమిది'' అన్నారు వర్షా ముందాడ, మాధవి.



● 'శశివదనే'లో ఓ దృశ్యం

లవ్.. యాక్షన్



● రక్షిత్, కోమలి

రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్ జంటగా సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శశివదనే'. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. శరవణ వాసుదేవన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'శశివదనే..' టైటిల్ సాంగ్‌ని డైరెక్టర్ హరీష్ శంకర్ రిలీజ్ చేశారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించిన ఈ పాటని హరిచరణ్, చిన్మయి శ్రీపాద పాడారు. ''లవ్, యాక్షన్ డ్రామాగా రూపొందిన చిత్రమిది'' అన్నారు సాయి మోహన్. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చోలేటి, కెమెరా: సాయికుమార్.

ఆ పేరుని తెరపై చూడాలనుకున్నా!

- శౌరి చంద్రశేఖర్ టి. రమేష్

''మా నాన్న చంద్రశేఖర్‌గారు ప్రతివారం నన్ను ఏదో ఒక సినిమాకి తీసుకెళ్లేవారు. అలా చిన్నతనంలోనే సినిమాలపై ఇష్టం మొదలైంది. మా నాన్నగారు చనిపోయాక ఆయన పేరుని నా పేరులో పెట్టుకున్నాను. ఆ పేరుని తెరపై చూడాలనే నా కోరిక 'బుట్టబొమ్మ' ద్వారా తీరుతుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు శౌరి చంద్రశేఖర్ టి. రమేష్. అనిఖా సురేంద్రన్, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'బుట్టబొమ్మ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 4న విడుదల కానుంది. ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్న చంద్రశేఖర్ టి.రమేష్ మాట్లాడుతూ– ''రామ్ గోపాల్ వర్మ గారి కార్పొరేషన్‌లో పని చేశాను. ఈశ్వర్ నివాస్‌గారు దర్శకత్వం వహించిన నాలుగు హిందీ సినిమాలకు పని చేశాను. ఆ తర్వాత సుకుమార్‌గారి వద్ద 'జగడం' నుంచి 'పుష్ప' సినిమా వరకు పని చేశాను. మలయాళ మూవీ 'కప్పేల'ని సితార వారు రీమేక్ చేస్తున్నారని తెలిసి, నేనే సంప్రదించాను. 'కప్పేల'లోని మెయిన్ పాయింట్ తీసుకొని తెలుగు నేటివిటీకి తగ్గట్లు 'బుట్టబొమ్మ'లో మార్పులు చేశాం. ఈ మూవీ తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది'' అన్నారు.



● శౌరి చంద్రశేఖర్



● విజయ్, త్రిష

పదిహేనేళ్ల తర్వాత....

దాదాపు పదిహేనేళ్ల తర్వాత జోడీ కట్టారు హీరో విజయ్–హీరోయిన్ త్రిష. మహేశ్‌బాబు 'ఒక్కడు' తమిళ రీమేక్ 'గిల్లి' (2004)లో తొలిసారి జోడీ కట్టారు విజయ్, త్రిష. ఆ తర్వాత 'తిరుపాచ్చి'(2005), (తెలుగులో 'అన్నవరం'గా రీమేక్ అయ్యింది) తెలుగు 'అతనొక్కడే'కు తమిళ రీమేక్ 'ఆది' (2006), 'కురివి' (2008) సినిమాల్లో జంటగా నటించారు. తాజాగా విజయ్ కెరీర్‌లో 67వ చిత్రంగా తెరకెక్కుతున్న మూవీలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న విషయాన్ని చిత్ర యూనిట్ ప్రకటించింది. దీంతో విజయ్, త్రిష ఐదోసారి స్క్రీన్ షేర్ చేసుకున్నట్లవుతుంది. 'మాస్టర్' తర్వాత హీరో విజయ్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఇది. సంజయ్ దత్, ప్రియా ఆనంద్, అర్జున్ సర్జా, గౌతమ్ మీనన్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్.

వింతగా మారబోతోంది

తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వంలో భరత్ కుమార్, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ, శ్రీనివాస్ కౌశిక్, సాయికృష్ణ గద్వాల్, విజయ్ కుమార్ నిర్మిస్తున్న చిత్రం 'కీడా కోలా'. ఎనిమిది ప్రధాన పాత్రలతో ఈ మూవీ రూపొందుతోంది. వారిలో బ్రహ్మానందం ఒక కీలక పాత్ర చేస్తున్నారు. బుధవారం బ్రహ్మానందం పుట్టినరోజు సందర్భంగా ఆయన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. 'మీ ప్రపంచం వింతగా మారబోతోంది' అని పోస్టర్‌పై క్యాప్షన్ ఇచ్చారు. ''ప్రతి ఇంట్లో ఉండే తాత పాత్రలో (వరదరాజు) బ్రహ్మానందంగారు కనిపిస్తారు'' అన్నారు తరుణ్ భాస్కర్.



● బ్రహ్మానందం

తెరపైకి జాక్సన్ జీవితం

పాప్ సంగీత సామ్రాజ్యానికి రాజుగా వెలిగిన మైఖేల్ జాక్సన్ జీవితంతో 'మైఖేల్' పేరుతో బయోపిక్ రూపొందనుంది. ఈ చిత్రానికి ఆంటోయిన్ ఫుక్వా దర్శకుడు. మైఖేల్‌గా ఆయన సోదరుడు జెర్మైన్ కుమారుడు జాఫర్ జాక్సన్ నటించనున్నారు. వెండితెరపై యాక్టర్‌గా జాఫర్‌కు ఇదే తొలి చిత్రం. ''మా అంకుల్ కథలో నటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను'' అన్నారు జాఫర్. ''మైఖేల్ జాక్సన్ లక్షణాలు జాఫర్‌లో చాలా ఉన్నాయి. మైఖేల్‌గా నటించగల ఒకే ఒక్క వ్యక్తి జాఫర్ అని నమ్ముతున్నాను'' అన్నారు నిర్మాతల్లో ఒకరైన గ్రాహం. ఇక 1958 ఆగస్టు 29న పుట్టిన మైఖేల్ జాక్సన్ 2009 జూన్ 25న మరణించిన విషయం తెలిసిందే.



● మైఖేల్



● జాఫర్

అయోమయంలో...



● రణధీర్, శుభశ్రీ

రణధీర్, శుభశ్రీ జంటగా ఊర శ్రీను దర్శకత్వంలో 'అయోమయంలో అరవింద' సినిమా ఆరంభం అయింది. డాక్టర్ ప్రసాద్ మూరెళ్ల సహకారంతో లెక్కల మహేంద్రా రెడ్డి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి వి. శ్రీనివాసరెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, తుమ్మలపల్లి రామసత్యనారాయణ క్లాప్ కొట్టారు. మేడిది వెంకటేశ్వరరావు గౌరవ దర్శకత్వం వహించారు. ''సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది'' అన్నారు ఊర శ్రీను. ''ఇప్పటివరకు వచ్చిన కథలకు భిన్నంగా మా చిత్రకథ ఉంటుంది'' అన్నారు మహేంద్రా రెడ్డి. ''ఈ చిత్రంలో మంచి సందేశం ఇస్తున్నాం'' అన్నారు ప్రసాద్ మూరెళ్ల. ఈ చిత్రానికి కెమెరా: జి.అమర్, సంగీతం: శివ కాకాని.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 602/A, Rampur Village, Dharmasagar Mandal, Warangal dist - 506151, T.G. and Printed at Jagati Publications Limited,Survey No. 602/A, Rampur Village, Dharmasagar Mandal, Warangal dist - 506151.
Editor: V.Murali,(Responsible for selection of News under the PRB Act) Phone No. 08711-223111, Fax No.08711- 223330, RNI Regn No. TEL TEL/2008/23806.